వైభవంగా స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం

స్వామి, అమ్మ వార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 6: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవసేవను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ తంతును వీక్షించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి వారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. రాత్రి స్వామివారి తిరువారాధన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 17వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, స్వామివారి ఖజానాకు రూ. 27,79,764 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పురస్కారాలు అందుకున్న వారితో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత

స్వచ్ఛంద సేవకులకు ఉగాది పురస్కారాలు

మోత్కూరు, ఏప్రిల్ 6 : నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న వారిని గుర్తించి మోత్కూరి విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ వారు ఉగాది పురస్కారాలు అందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవార్డు గ్రహీతలు మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి శాలువాతో సన్మానించి అవార్డులు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మచారి, ప్రముఖులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులను సంరక్షించాలి

- ఎంపీపీ రచ్చ కల్పన

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కల్పన

మోత్కూరు, ఏప్రిల్ 6 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్యలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ రచ్చ కల్పనాలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమాశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గతంలో కంటే ఈ సంవత్సరం ఎండ వేడిమి అధికంగా ఉందని, స్థానికంగా ఉన్న మంచి నీటి వనరులు అడుగంటి పోయి తాగు నీటి కష్టాలు ప్రారంభం అవుతున్నాయన్నారు. ప్రత్యేకాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిపై నివేదిక సమర్పించారు. సమావేశంలో ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బి. లక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆశ కార్యకర్తలు

ఉపాధి కూలీలకు రూ.500 వేతనం చెల్లించాలి

- రైతుసేవా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీశైలం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 6 : ఉపాధిహామీ కూలీలకు కొలతలతో నిమిత్తం లేకుండా రోజుకు రూ.5 వందల వేతనం చెల్లించాలని రైతు సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మసిరెడ్డికుంటలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో ఫిల్డ్‌అస్టిసెంట్ వెలిమెకన్నె సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈదమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న వడ్డెర కులస్తులు

ఈదమ్మకు బోనాలు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 6 : మండల కేంద్రంలోని ఈదమ్మ గ్రామ దేవతకు శనివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కొమ్మరాజుల సత్తయ్య, శ్రీను, శ్రీహరి, హరికృష్ణ, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

విద్యార్థులకు నోటుపుస్తకాలు

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని పంతంగి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టేబుళ్లు, కుర్చీ లు, విద్యార్థులకు నోటుబుక్స్ అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ సురేశ్, సాంబశివ, సిద్ధార్థ, ఎస్‌హెచ్ఏ ప్రతినిధి భానుప్రసాద్, నరేశ్, సందీప్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు తీరని కష్టాలు

- ధాన్యానికి రూ.500 బోనస్, ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి
- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 6: గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధర్నాలు, నిరసనలు లేకుండానే ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే రైతులకు తీరని కష్టాలు మొదలయ్యాయని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని రైతుబజార్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధాన్యానికి రూ.500 బోసన్, నీటి కొరతతో పంటలు ఎండిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ రైతులకు, ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా పాలన సాగించారని, కాంగ్రెస్ నాయకులు మాత్రం ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. గత పదేండ్లుగా భువనగిరి నియోజకవర్గం కాళేశ్వర నీటితో జలకళతో ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంలో నీళ్లున్నా విడుదల చేయకుండా పంటలను ఎండబెట్టిందన్నారు. కరెంట్ బిల్లు కట్టాల్సి వస్తదనే సాకుతో నీళ్లు విడుదల చేయలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. వెంటనే రైతులకిచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్, ఎండిన పంటలకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తేమి కాదని, రైతుల, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేదాక ప్రజల పక్షాన ఉంటూ పోరాటం చేస్తామన్నారు. హామీలు మర్చి కాలం గడపాలని చూస్తున్న కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

దీక్షలో పాల్గొన్న చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఉద్యమాల పార్టీ అని, అనుకున్నది సాధించేవరకు, ప్రజలు, రైతులను మోసం చేసిన పార్టీని గద్దెదించే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జడల అమరేందర్ గౌడ్, కొలుపుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ.కిరణ్‌కుమార్, జనగాం పాండు, తుమ్మల వెంటక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాచమల్ల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు మొగుళ్ల శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, రాచమల్ల రమేశ్, ఇట్టబోయిన గోపాల్, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్, తాడూరి భిక్షపతి, వెల్దుర్తి రఘునాథ్, బర్రె రమేశ్, జహంగీర్, పుట్ట వీరేశ్, నితీశ్, సూరజ్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష.. తాసీల్దార్‌కు వినతిపత్రం

ఆలేరు, ఏప్రిల్ 6 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు అనేక హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి రైతులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, వరి ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలేరులో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు సరైన సమయంలో సరైన రీతిలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు గంగుల శ్రీనివాస్‌యాదవ్, పుట్ట మల్లేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు దాసి సంతోష్, ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏసురెడ్డి మహేందర్‌రెడ్డి, చామకూర అమరేందర్‌రెడ్డి, వడ్ల శోభన్, ఏఎంసీ మాజీ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్, యాదగిరిగుట్ట సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ ఎంపీటీసీలు బింగి రవి, మామిడాల ఆంజనేయులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పత్తి వెంకటేశ్, జంగ స్వామి, మునిపెల్లి భిక్షపతి, చిమ్మి శివమల్లు, జూకంటి ఉప్పలయ్య, బాకి శ్రీను, బన్నీ, నాయకులు పాల్గొన్నారు.


తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

- కలెక్టర్ హనుమంతు కె, జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 6 : తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జండగే అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో మండలాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి పంపిణీ, సరఫరా, మరమ్మతులపై సమీక్షించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, పవర్ బోర్లు, చేతి పంపులే కాకుండా ప్రతి గ్రామంలో, వార్డులో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, రోజువారి పంపిణీకి తగిన విధంగా నీటి సరఫరా ఉండాలన్నారు. తేడా ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని, సరఫరాలో సమస్యలుంటే గుర్తించాలని, ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో పేర్కొన్న విధంగా తాగునీటి సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన ముఖ్యమన్నారు. ఎస్‌డీఎఫ్ ప్రత్యేక అభివృద్ధి నిధులు, గ్రామపంచాయతీ నిధులు, సంబంధిత శాఖల నిధులు బోర్లు, పైప్‌లైన్ల మరమ్మతులకు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణయ్య, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

9న ఉగాది కవి సమ్మేళనం

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 6 : ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు స్థానిక మార్కండేశ్వరస్వామి ఆలయ ఆవరణలో త్రివేణి సాహితీ సంఘం, కేవీటీ స్పోర్ట్స్ క్లబ్, సూర్యయాత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహితీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు గుంటి దయానంద్, గజ్జల రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు గంట ముందుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9985898063ను సంప్రదించాలని సూచించారు.

'వరి ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలి'

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు దుర్గం యాదమల్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను మర్చిపోవడం సిగ్గుచేటన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారే కాని వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, మోహన్‌రెడ్డి, యాదిరెడ్డి, కృష్ణారెడ్డి, రఘుపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

కుర్మ సంఘం మండల అధ్యక్షుడిగా సుధాకర్

రాజాపేట, ఏప్రిల్ 6 : కుర్మ సంఘం మండలాధ్యక్షుడిగా మండలంలోని దూదివెంకటాపురం గ్రామానికి చెందిన వస్పరి సుధాకర్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా జూకంటి ప్రవీణ్‌కుమార్, మీస బాలమల్లయ్య, చిన్నం బాలరాజు, గౌరవాధ్యక్షుడిగా పుప్పాల నర్సయ్య, గౌర బక్కయ్య, పోసుకొండ రాములు, ఉపాధ్యక్షులుగా గవ్వల సిద్దేశ్వర్, రేగు సిద్ధులు, బల్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బింగి కరుణాకర్, సహాయకార్యదర్శులుగా కిష్టయ్య, ఎమ్మ భాస్కర్, కార్యదర్శులుగా మల్లేశం, జెన్నె సిద్ధులు, కోశాధికారిగా బోడపట్ల అశోక్, యువజన అధ్యక్షుడిగా కాకర్ల ఉదయ్, ప్రధాన కార్యదర్శిగా రావుల ఉపేందర్ ఎన్నికయ్యారు.

పద్మాశాలీ నిత్యాన్నదాన సత్రం ధర్మకర్తగా స్వామి

రాజాపేట, ఏప్రిల్ 6 : యాదగిరిగుట్టలోని అఖిల భారత పద్మశాలీ నిత్యాన్నదాన సత్రం ధర్మకర్తగా మండలంలోని రఘునాథపురం మాజీ సర్పంచ్ రాచకొండ స్వామిని శనివారం ఎన్నుకున్నారు. స్వామిని పద్మశాలి సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 6: తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భువనగిరికి చెందిన మాస్టర్ గుర్రం కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 5న తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయనను ఎన్నుకున్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు పరమేశం, శివప్రసాద్, టి.మల్లేశ్, రాధ, సుధాకర్, బాలయ్య, ప్రపుల్‌రెడ్డి శనివారం ఆయనను అభినందించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్వామీజీలు

గుట్టలో 13 నుంచి అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహాయజ్ఞం

యాదగిరిగుట్ట, ఏప్రిల్6: ఈ నెల 13 నుంచి మే 10 వరకు యాదగిరిగుట్ట పట్టణంలోని శుభోదయ గార్డెన్‌లో అక్షయ సువర్ణ లక్ష్మీనారయణ, లక్ష్మీనరసింహ మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు అఖండ నామాశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాసు ప్రభూజీ తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకొని మహాయజ్ఞానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులు పాటు జరిగే మహాయజ్ఞంలో ప్రతిరోజు యాదగిరిగుట్ట ఆలయ కొండ చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చివరిరోజు నిర్వహించే వేడుకల్లో 108 మంది పీఠాధిపతులు, స్వామిజీలు, సాధువులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అమెరికాలోని బ్రాహ్మణ మిషన్ ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మానంద మహి మాతాజీ, నిరుశేషస్వామిజీ, రామానందస్వామిజీ, డాక్టర్ జనార్దన్ పాల్గొన్నారు.

భానుడు భగభగ..

- జిల్లాలోని మూడు ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు
- యాదగిరిగుట్టలో అత్యధికంగా 43.8 డిగ్రీలు నమోదు
- ఎండ వేడికి అల్లాడుతున్న ప్రజలు

యాదగిరిగుట్ట/భువనగిరి కలెక్టరేట్ , ఏప్రిల్ 6: జిల్లాలో భానుడి ప్రతాపం రోజు రోజుకు పెరిగి పోతోంది. పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైనే నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం కూడా జిల్లాలోని మూడు ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రత యాదగిరిగుట్టలో 43.8 డిగ్రీలు నమోదైంది. ఎండ వేడిమి పెరుగుతుండడంతో కొద్దిరోజులుగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కొండపైన మధ్యాహ్న సమయంలో భక్తులు లేక కొండ ప్రాంగణం బోసి పోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లోనే భక్తులు స్వామివారి దర్శనానికి వెళ్తున్నారు.

జిల్లా అంతటా వేడి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదగిరిగుట్టలో అత్యధికంగా 43.8 డిగ్రీలు, అత్యల్పంగా 34.8 డిగ్రీలు, వలిగొండలో అత్యధికంగా 43.6, అత్యల్పంగా 35.6, ఆలేరు మండలం గొలనుకొండలో 43.3- 37.1, మోత్కూరులోని దత్తప్పగూడెంలో 42.1-34.1, బొమ్మలరామారంలో 41.8, 34.1, చౌటుప్పల్‌లో 41.7-36.5, సంస్థాన్‌నారాయణపూర్ మండలం జనగామలో 41.7 - 37.6, ఆత్మకూరు(ఎం)లో 41.6-34.7, రామన్నపేటలో 41.4-34.9, రాజాపేటలో 41.1-35.2, మోటకొండూరులో 40.4-34.6, బీబీనగర్‌లో 40.3-36.2, అడ్డగూడూరులో 40.2-31.5, భూదాన్‌పోచంపల్లిలో 40.1-37.6, గుండాలలో 39.9-33.6, తుర్కపల్లి(ఎం)లో అత్యధికంగా 39.1, అత్యల్పంగా 34.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

- జడ్జి ఎస్.చందన

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి చందన, కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట, ఏప్రిల్ 6 : విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన అన్నారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను స్థానిక జేపీ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సామాజిక మార్పులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థి దశలోనే వారిలో నైతిక విలువలు పెంపొదించేలా విద్యాబోధన సాగించాలని సూచించారు. ప్రముఖ సాహితీవేత్త కూరెళ్ల విఠలాచార్య, ఎంపీపీ నాగటి ఉపేందర్ మాట్లాడుతూ..విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి విద్య అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జేవీఎస్ మణి, డైరక్టర్లు జెల్ల వెంకటేశం, ఊట్కూరి నర్సింహ, ఎండీ అజీమొద్దిన్, ఉపాధ్యాయులు రషీద్, మురళి, నరేశ్, ప్రవీణ్, అయితరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్


ఓపీఓల శిక్షణలో పాల్గొని మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

ఆలేరు, ఏప్రిల్ 6 : రానున్న పార్లమెంట్ ఎన్నికల విధులను సమర్ధ వంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. శనివారం ఆలేరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఓపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఇబ్బందులు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైయినర్ దూడల వెంకటేశ్, హరినాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఓపీఓలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాస్టర్ ట్రైనర్లు నాగిరెడ్డి, సత్తిరెడ్డి పోస్టల్ బ్యాలెట్‌తో పాటు కామన్ పోలింగ్‌పై వివరించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏఎంఓ జె. శ్రీనివాస్, తాసీల్దార్ రవికుమార్, డీటీ ఎండీ షఫి యొద్దీన్, ఆర్ఐ మల్లిఖార్జున్‌రావు, సీనియర్ అసిస్టెంట్ పాండు పాల్గొన్నారు.

వలిగొండ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎన్నికల అధికారులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని భువనగిరి ఆర్‌డీఓ అమరేందర్ సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఆలకుంట శ్రీనివాస్, యడవల్లి భిక్షమయ్య, బద్దం సంజీవరెడ్డి, నరేందర్ రెడ్డి, ఎంఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఓపీఓలకు ఎన్నికల విధులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాసీల్దార్ శాంతిలాల్ పోలింగ్ విధులు, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేశ్, మాస్టర్ ట్రైనర్లు కూళ్ల ఉమాశేఖర్, ఉదయ్‌కుమార్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని జలాల్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఓపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాసీల్దార్ శ్రీనివాస్‌రావు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం పెండెం నాగార్జున, నిర్మలా జ్యోతి, ట్రైనింగ్ అధికారులు రాజు, రమేశ్, దినేశ్ పాల్గొన్నారు.

మల్కాపురం టెక్స్‌టైల్‌పార్క్‌లో అగ్నిప్రమాదం

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్6 : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని టెక్స్‌టైల్ పార్కులో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. పార్కు ఆవరణలో ఉన్న చెట్లు కాలిపోవడంతో మంటలు ఎగిసి పడుతున్నాయి. విద్యుత